మహాలక్ష్మి.. నమోస్తుతే

- ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- ఆలయాల్లో కిటకిటలాడిన భక్తులు

చిత్తూరు రూరల్: దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ప్రధాన ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలంకరణలతో కాంతులీనుతున్నాయి. వందే శక్తి స్వరూపిణీ అంటూ భక్తులు అమ్మవారిని కొలిచారు. దేవీ నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. 108 బిందెలతో పాలాభిషేకం చేశారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఈఓ మునిశేఖర్ అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం మహాచండీయాగం శాస్త్రోక్తంగా జరిపించారు. రాత్రి మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు అభయమిచ్చారు. గుర్రప్పనాయుడు వీధిలోని అంకాలపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పుష్పాలంకారం, శ్రీలక్ష్మి అలంకారంలో అమ్మవారు కనువిందు చేశారు. సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మి అలంకారంలో దుర్గామాతను కొలువుదీర్చారు. తేనెబండలోని ముత్యాలమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులను కటాక్షించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

చిత్తూరు తేనెబండలో శ్రీపాదం ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. దశావతారం, వేంకటేశ్వరస్వామి, త్రిశక్తి, శ్రీకృష్ణుడు, ఆల్వార్, 18 సిద్ధులు, ఒక పక్క వివాహ సందడి, మరో పక్క సీమాంత సంబరాలతో కూడిన 110 దేవతామూర్తుల విగ్రహాలను కొలువుదీర్చారు. భక్తులు ఆసక్తికరంగా తిలకించారు. అలాగే అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కూడా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

మహాలక్ష్మిగా గంగమ్మ

గుడిపాల: మండలంలోని పల్లూరు గ్రామంలో గంగమ్మతల్లి మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. కందగిరి కొండ వద్ద ఉన్న శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ మహాలక్ష్మిగా అభయమిచ్చారు. మహిళలు కుంకుమ అర్చనలో పూజలు చేశారు.

సరస్వతిదేవిగా మరగదాంబికా దేవి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైన మరగదాంబికదేవి సర్వసతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఆలయంలో అమ్మవారికి మహిళలు కుంకుమార్చన నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్స్పెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

- కాణిపాకం గ్రామంలో వెలసిన కాళికామాత అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి అమ్మవారికి పూజలు చేశారు.
- యాదమరిలో వెలసిన కన్యాకాపరమేశ్వరి అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని బాలత్రిపుర సుందరి అలంకరణలో సింహ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

వజ్రాలపురం బోయకొండలో..

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉదయం ధ్వజారోహణం, గణపతి హోమం, కలస పూజలు చేశారు. మొదటి రోజు వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీగాయత్రిదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. బెంగళూరుకు చెందిన చాతుర్య, పురుషోత్తం, దీప, గోపి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజర్ మొగిలప్ప పాల్గొన్నారు. అలాగే మొగిలివెంకటగిరి గ్రామంలోని గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమితీ మాజీ ఉపాధ్యక్షుడు తులసీరామకృష్ణారెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

బాలాత్రిపురసుందరీదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవత ముత్యాలమ్మ శ్రీబాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శాంతినగర్‌కు చెందిన అనసూయ రామానాయుడు, బంగారుపాళ్యానికి చెందిన పుష్ప రుద్రప్ప దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఛైర్మన్ కృష్ణమూర్తి, అర్చకులు మురళిగురుకుల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


తేనెబండలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు


చిత్తూరు: అంకాళపరమేశ్వరి


మహాలక్ష్మీగా ముత్యాలమ్మ


గుడిపాల: దుర్గమ్మ


చిత్తూరు: మహాలక్ష్మీ అలంకరణలో దుర్గమ్మ


గుడిపాల: పల్లూరు గంగమ్మ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


కాణిపాకం: సరస్వతీ దేవిగా మరగదాంబికా అమ్మవారు


బాలాత్రిపురసుందరిగా కాళికాదేవి


యాదమరిలో కన్యకాపరమేశ్వరి


బంగారుపాళెం: బాలాత్రిపురసుందరిదేవిగా ముత్యాలమ్మ

క్లుప్తంగా

నేడు ఐరాలలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఐరాల: మండల కేంద్రంలోని సచివాలయ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పెషలిస్ట్ డాక్టర్లు అన్ని రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వెలుతురుచేనులో..

బంగారుపాళెం: మండలంలోని వెలుతురు చేను గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి లోహిత్‌చెంగల్ రాయన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు శిబిరాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

యాదమరిలో ఎమ్మెల్యే పర్యటన నేడు

యాదమరి: పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సోమవారం యాదమరి మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు 14కండిగ ముస్లింవాడ గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి ఆరోగ్యశాఖ అధికారులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి రామాలయంలో ఉత్సవాలు

చిత్తూరు రూరల్: స్థానిక రాములుగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 24వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు స్వామి వారు నవ రూపాల్లో భక్తులకు దర్శమిస్తారన్నారు.

సాయిబాబా మహా సమాధి పూజలు


బాబాకు పాలాభిషేకం చేస్తున్న సీకే బాబు

చిత్తూరు రూరల్: కట్టమంచిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం బాబా మహా స మాధి పూజలను ఘనంగా నిర్వహించారు. మూల విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మా జీ ఎమ్మెల్యే సీకే బాబు బాబాకు పాలాభిషేకం చేసి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామిని దర్శించుకున్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న నాగసుబ్బారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి కోరారు. ఆదివారం చిత్తూరులోని ఎస్టీయూ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా నాయకుడు చంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అక్టోబర్ 31వ తేదీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలన్నారు. కార్మికులపై బీజేపీ అవలంబిస్తున్న చట్టాలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కేంద్రం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఎస్టీయూ నాయకులు గంటామోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎన్‌పీఓ కార్యదర్శిగా పురుషోత్తం


పురుషోత్తం

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ తపాలా సంఘాల సమాఖ్య (ఎఫ్ఎన్‌పీఓ) గ్రూప్–సీ అధికారుల సంఘం చిత్తూరు డివిజన్ కార్యదర్శిగా పురుషోత్తం (పీఎల్ఐ అభివృద్ధి అధికారి, చిత్తూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎఫ్ఎన్‌పీఓ 2వ వార్షిక సమావేశం చిత్తూరులో నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రూప్–సీ సంఘానికి పురుషోత్తం ఎన్నికవ్వగా, పోస్టుమన్, ఎంటీఎస్ డివిజన్ కార్యదర్శిగా మహమ్మద్ రఫీ, ఎన్‌యూజీడీఎస్ కార్యదర్శిగా ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం జాతీయ కార్యదర్శి వాసిరెడ్డి శివాజీ, తపాలాశాఖ సూపరింటెండెంట్ లక్ష్మన్న, గ్రూప్–సీ సర్కిల్ నాయకులు డేవిడ్‌రాజు, లక్ష్మీనారాయణ, మురళీ, యోగేశ్వరరావు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం


నివాళులర్పిస్తున్న ఎస్టీయూ, ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రపంచం గర్వించే మేధావి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు గంటామోహన్ అన్నారు. ఆదివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కలాం లాంటి ఆదర్శమైన వ్యక్తులు అరుదుగా ఉంటారన్నారు. తన పూర్తి జీవితాన్ని నిస్వార్థంగా దేశం కోసం, సమాజం కోసం అంకితం చేసిన త్యాగ పురుషుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేవరాజులురెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, పూర్వ విద్యార్థులు

చిత్తూరు రూరల్: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ బాల్యంలో ఒకే పాఠశాలలో చదివి 33 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో ఒక్కటయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989–90 విద్యార్థులు కలుసుకున్నారు. తాము చదివిన పాఠశాలను మళ్లీ చూసుకుని ఆనందబాష్పాలు రాల్చారు. మిత్రులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల పాఠశాలలో జరిగిన మధురానుభూతులను పంచుకుని ఆనందడోలికల్లో మునిగితేలారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా విలువైందని నేటి కలయికకు హాజరైన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాలను ఎంచుకుని ఉన్నత స్థానాలకు ఎదగడం అభినందనీయమన్నారు. పూర్వవిద్యార్థిగా ఈ వేడుకలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు హాజరయ్యారు. ఆయనకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి సన్మానించారు. జ్ఞాపికలను అందజేశారు.


బీఎన్‌ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మురళిమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో స్పందన జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల మధ్యలో ప్రజలు వినతులు అందచేయవచ్చన్నారు. ఇక ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 0857–2232745, వాట్సాప్ – 9849907885కు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

గణితంపై అవగాహన

చిత్తూరు రూరల్: నగరంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గణిత శతావధానం చేసిన బాల గణిత మేధావి అనఘా లక్ష్మీ విద్యార్థులతో మమేకమై గణితంపై ఆసక్తిని పెంపొందించేందుకు మెలకువలు నేర్పింది. నిర్వాహకులు అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం విద్యార్థులకు సృజన కార్యక్రమంలో భాగంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు సుధాకర్, పాపుదేశీ జయంతి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : నిందితుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ మాధవస్వామి, సిబ్బంది

పుంగనూరు: పెద్దపంజాణి మండలం గల్లావారిపల్లెలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసి అతడి నుంచి 960 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మాధవస్వామి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అందిన రహస్య సమాచారం మేరకు గల్లావారిపల్లెలో దాడులు చేశారు. జగపతి అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతడు కర్ణాటకలోని రాకెవెల్లి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. అతడిపై కేసు నమోదు చేసి తరలించారు. దాడుల్లో ఎస్ఐ మస్తాన్‌వల్లి, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనాథరెడ్డి, నాగరాజ, నాగరాజు, గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా గణనాథుని కల్యాణోత్సవం


గణపతి హోమం చేస్తున్న వేదపండితులు


విశేష అలంకరణలో ఏకదంతుడు

గుడిపాల: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మండలంలోని వసంతాపురం టీటీడీ కల్యాణ మండపంలో గణపతి హోమం, స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. సర్పంచ్ రజినీకాంత్ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల ముందే పిచ్చిమొక్కలు


వీరభద్రకాలనీలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి కూతవేటు దూరంలోని వీరభద్రకాలనీ అధ్వానంగా మారింది. ఆ ప్రాంతంలో ఇళ్ల ముందే పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అసలే కాలువ లేక మురుగునీరు నివాసాల ఎదుటే నిల్వ చేరి దోమల నివాసంగా మారింది. అంటువ్యాధులు ప్రబలుతున్న సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ పట్టించుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.
ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాలు (ప్లాట్స్)ను శుద్ధి చేయకుండా వదలడంతో ఇలా మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.